క్లుప్తంగా

అనాథలకు భోజనాల పంపిణీ



భోజనాలు పంపిణీ చేస్తున్న కేశవ

కొత్తపట్నం: మండలంలోని అల్లూరు, కొత్తపట్నంలో వృద్ధులు, వికలాంగులు, అనాథలకు మదర్ థెరిసా హెల్పింగ్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో ఆదివారం భోజనాలు పంపిణీ చేశారు. షేక్ మస్తాన్‌వలి ఆర్థిక సాయంతో నిర్వహించిన ఈ కార్యక్రమంలో మదర్ థెరిసా హెల్పింగ్ ఆర్గనైజేషన్ ప్రతినిధి డి.కేశవ, సభ్యులు ఎం.సునీల్, డి.సుజీత్, ఎం.సన్నీ, ఎం.రాజ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

అంబేడ్కర్‌ను ఆదర్శంగా తీసుకోవాలి



అంధ విద్యార్థులకు దుస్తులు పంపిణీ చేస్తున్న వెంగళరావు

ఒంగోలు టౌన్: భారత రాజ్యాంగ నిర్మాత, ప్రపంచ మేధావి డాక్టర్ బీఆర్ అంబేడ్కర్‌ను ఆదర్శంగా తీసుకుని చదువులో రాణించాలని దళిత సంఘాల ఐక్యవేదిక జాతీయ అధ్యక్షుడు చప్పిడి వెంగళరావు విద్యార్థులకు పిలుపునిచ్చారు. నగరంలోని ఉత్తర బైపాస్‌లో ఉన్న గుడ్ న్యూస్ అంధుల పాఠశాల విద్యార్థులకు కుటుంబ సభ్యులతో కలిసి ఆదివారం దుస్తులు అందజేశారు. ఉన్నత శిఖరాలు అధిరోహించాలనే లక్ష్యంతో విద్యార్థులు ఇష్టంగా చదవాలని సూచించారు. భారతదేశ ఆర్థికాభివృద్ధిలో భాగస్వాములు కావాలని ఆకాంక్షించారు. ఐక్య వేదిక ద్వారా స్కూలు అవసరాలు తీర్చేందుకు సహకరిస్తామని హామీ ఇచ్చారు. అంధ విద్యార్థులకు సాయం చేయడంపై స్కూలు నిర్వాహకుడు స్వర్ణ మోహన్‌రావు సంతోషం వ్యక్తం చేశారు.

వృద్ధాశ్రమానికి నిత్యావసరాల పంపిణీ



వృద్ధాశ్రమానికి నిత్యావసరాలు అందిస్తున్న జెడ్పీటీసీ శ్రీనివాసరావు

చీమకుర్తి: మండలంలోని పల్లామల్లిలో రిటైర్డ్ టీచర్ మద్దాళి సుబ్బారావు నిర్వహిస్తున్న వృద్ధాశ్రమానికి జెడ్పీటీసీ సభ్యుడు వేమా శ్రీనివాసరావు చేతుల మీదుగా ఆదివారం నిత్యావసర వస్తువులు పంపిణీ చేశారు. కూనంనేనివారిపాలెం గ్రామానికి చెందిన ఉపాధ్యాయుడు వేమా శేషు, శ్రీదేవి దంపతులు రూ.10 వేల విలువ చేసే నిత్యావసరాలు అందించారు. వాటిని జెడ్పీటీసీతో కలిసి వృద్ధాశ్రమం నిర్వాహకుడు సుబ్బారావుకు అందించారు. అనంతరం వృద్ధాశ్రమాన్ని పరిశీలించారు. ఉద్యోగ విరమణ చేసిన అనంతరం సుబ్బారావు వృద్ధులకు సేవచేయడాన్ని అభినందించారు. దాత వేమా శేషు దాతృత్వాన్ని అభినందించారు. కార్యక్రమంలో దాసరి హనుమంతరావు, బత్తుల అర్జున్, ఇస్తర్ల శంకర్, దూపాటి సత్యం, స్థానికులు పాల్గొన్నారు.

గుడ్‌న్యూస్ ఆశ్రమంలో సేవా కార్యక్రమాలు



అంధ విద్యార్థులకు నిత్యావసరాలు అందజేస్తున్న హోప్ సంస్థ ప్రతినిధులు

ఒంగోలు టౌన్: నగరంలోని కర్నూలు రోడ్డులో గల గుడ్ న్యూస్ అంధుల ఆశ్రమంలో ది హోప్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఆదివారం పలు సేవా కార్యక్రమాలు నిర్వహించారు. పిల్లలకు నిత్యావసర సరుకులు అందజేయడంతో పాటు వారి చదువులకు, అనారోగ్యంతో బాధపడుతున్న ఒక బాలికకు చికిత్స కోసం నగదు అందజేశారు. అంధ విద్యార్థులకు సహాయం అందజేసిన హోప్ ఫౌండేషన్ చేపడుతున్న కార్యక్రమాలను హోం ఇన్‌చార్జి మోహన్ అభినందించారు. ఇలాంటి సేవా కార్యక్రమాలను నిరంతరం కొనసాగించాలని కోరారు. కార్యక్రమంలో ఫౌండేషన్ వ్యవస్థాపకులు తేళ్ల కిరణ్‌కుమార్, సిద్ధిక్, రాజశేఖర్, యశ్వంత్, పరంజ్యోతి, మస్తాన్ తదితరులు పాల్గొన్నారు.

మార్మోగిన శివనామస్మరణ





ఒంగోలులో శివలింగానికి అన్నాభిషేకం చేస్తున్న అర్చకుడు, హాజరైన భక్తులు

- ఒంగోలులో శివయ్యకు ఘనంగా అన్నాభిషేకం
- హాజరైన వందలాది మంది భక్తులు
- చీమకుర్తి హరిహరక్షేత్రం, మడనూరులో వైభవంగా కల్యాణోత్సవం

ఒంగోలు అర్బన్: మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని శివయ్యకు శనివారం చేపట్టిన ప్రత్యేక పూజా కార్యక్రమాలు కొనసాగాయి. ఆదివారం కూడా శైవక్షేత్రాలన్నీ శివనామస్మరణతో మార్మోగాయి. ఒంగోలు అంజయ్య రోడ్డులోని ఉమామహేశ్వరీ సమేత పంచలింగేశ్వరస్వామి దేవస్థానంలో శనివారం అర్ధరాత్రి దేవాలయ ప్రధాన అర్చకులు నిడుప్రోలు కోటేశ్వరశర్మ ఆధ్వర్యంలో అర్చక బృందం శివలింగానికి ఘనంగా అన్నాభిషేకం నిర్వహించారు. జాగారం సందర్భంగా ధ్యానం, ప్రవచనాలు వంటి కార్యక్రమాలు నిర్వహించారు. వందలాదిగా హాజరైన భక్తులు ఓం నమః శివాయ అంటూ భక్తి ప్రపత్తులతో దేవాలయంలో నిర్వహించిన ప్రత్యేక పూజలు, అభిషేకాల్లో పాల్గొని తీర్థప్రసాదాలు స్వీకరించారు. తెల్లవారుజామున 6 గంటల వరకు కార్యక్రమాలు నిర్వహించారు. దేవాలయ దర్మకర్తలు, పురప్రముఖులు, భక్తులు పాల్గొన్నారు.

చీమకుర్తి హరిహరక్షేత్రంలో...

చీమకుర్తి: చీమకుర్తిలోని హరిహరక్షేత్రంలో పార్వతీ సమేత నగరేశ్వరస్వామి కల్యాణోత్సవాన్ని ఆదివారం ఉదయం వైభవంగా నిర్వహించారు. వైఎస్సార్ సీపీ నాయకుడు, మాజీ మంత్రి శిద్దా రాఘవరావు, లక్ష్మీపద్మావతి దంపతులు, వారి కుటుంబ సభ్యులతో పాటు స్థానిక భక్తులు పాల్గొనగా, వేదపండితులు ఘనంగా దేవదేవుని కల్యాణోత్సవం నిర్వహించారు. శిద్దా రాఘవరావు దంపతులు స్వామివారికి పట్టువస్త్రాలు సమర్పించారు. తొలుత స్వామివారికి జ్యోతిర్లింగార్చన, లింగోద్భవకాల పూజలు, అభిషేకాలు నిర్వహించారు. ఆలయంలోని సకల దేవతలకు పూజలు నిర్వహించారు. శిద్దా వెంకటేశ్వర్లు, వెంకట సుబ్బమ్మ ట్రస్ట్ ఆధ్వర్యంలో భక్తులకు తీర్థప్రసాదాలతో పాటు అల్పాహారం అందించారు. చీమకుర్తి పట్టణంలోని పలువురు భక్తులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

మడనూరులో భక్తిశ్రద్ధలతో కల్యాణోత్సవం...

మడనూరు (కొత్తపట్నం): మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని కొత్తపట్నం మండలంలోని మడనూరులో ఆదివారం వేకువజామున స్వామివారి కల్యాణోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. గ్రామ పెద్దలు, ఈవో రమణారావు ఆధ్వర్యంలో శ్రీరామలింగేశ్వరస్వామి, కన్నేశ్వరస్వామిలకు పూజా కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం కల్యాణోత్సవాలు జరిపించారు. భక్తులు ఓం నమః శివాయ.. హరహర మహాదేవ శంభోశంకర అంటూ శివనామాన్ని స్మరించారు. ఆలయ ప్రాంగణంలో భక్తులు బారులుదీరారు. పూజా కార్యక్రమాల అనంతరం సముద్రస్నానాలు చేసిన ఆలయానికి వచ్చి దర్శనం చేసుకున్నారు. తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు.

కొత్తపట్నంలోని నాగేశ్వరస్వామి ఆలయంలో ఈవో వరదారెడ్డి, నాగేశ్వరస్వామి ఆలయ చైర్మన్ పురిణి రామలింగారెడ్డి ఆధ్వర్యంలో శివపార్వతుల కల్యాణ మహోత్సవం నిర్వహించారు. భక్తులు రాత్రికి నాలుగు దేవుళ్లతో గ్రామోత్సవం నిర్వహించినట్లు ఆలయ కార్యనిర్వహణాధికారి జి.రమణారెడ్డి తెలిపారు. రాత్రి వైఎస్సార్ సీపీ ఆధ్వర్యంలో పాట కచేరి, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా పోలీసులు ప్రత్యేక బందోబస్తు ఏర్పాటు చేశారు.



చీమకుర్తి హరిహరక్షేత్రంలో కల్యాణోత్సవంలో పాల్గొన్న మాజీ మంత్రి శిద్దా, కుటుంబ సభ్యులు



మడనూరులో రామలింగేశ్వరస్వామి, కన్నేశ్వరస్వాముల కల్యాణోత్సవం



కల్యాణోత్సవానికి హాజరైన భక్తులు

అదానీకి కాపు కాస్తున్న కేంద్ర ప్రభుత్వం



సమావేశంలో ప్రసంగిస్తున్న రమాదేవి

ఒంగోలు టౌన్: కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం అదానీకి అండగా నిలుస్తోందని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యురాలు డి.రమాదేవి ఆరోపించారు. స్థానిక సుందరయ్య భవన్‌లో ఆదివారం నిర్వహించిన ఒంగోలు నియోజకవర్గ సభ్యుల సమావేశంలో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. హిండెన్‌బర్గ్ నివేదిక తర్వాత కుప్పకూలిపోయిన అదానీ షేర్ల గురించి సమాధానం చెప్పాల్సిన కేంద్ర ప్రభుత్వం.. తప్పించుకుని తిరుగుతుందని విమర్శించారు. బీబీసీపై దాడులు చేయడం దుర్మార్గమన్నారు. నిజాలను నిగ్గు తేల్చడమే మీడియా అసలు పాత్ర అని చెప్పారు. ప్రజలపై కేంద్ర బడ్జెట్ మోయలేని భారాన్ని మోపిందని, ప్రజల సమస్యల పరిష్కారం విషయంలో నిర్లక్ష్యం వహిస్తోందని అన్నారు. కేంద్ర ప్రభుత్వ అస్తవ్యస్త విధానాల కారణంగా గతంలో ఎన్నడూ లేని విధంగా దేశం ఆర్థిక సంక్షోభాన్ని ఎదుర్కొంటోందని ఆందోళన వ్యక్తం చేశారు. కరోనా సమయంలో పేదలు తిండీతిప్పలకు ఇబ్బందులు పడుతుంటే బిలియనీర్ల సంపద మాత్రం అమాంతం పెరిగిందన్నారు. దేశంలో ఫాసిస్టు దాడులు పెరిగిపోతున్నాయని, ప్రజలకు శాంతియుత వాతారణంలో సామరస్యంగా బతికే అవకాశాలు లేకుండా పోయాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారాన్ని కోరుతూ ఈ నెల 24న నిరసన కార్యక్రమం చేపట్టినట్టు సీపీఎం జిల్లా కార్యదర్శి జీవీ కొండలరావు తెలిపారు. కార్యక్రమంలో చీకటి శ్రీనివాసరావు, తంబి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీ అభ్యర్థులను గెలిపించాలి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే కేపీ నాగార్జునరెడ్డి

- ఎమ్మెల్యే కేపీ నాగార్జునరెడ్డి

మార్కాపురం: తూర్పు రాయలసీమ నుంచి పట్టభద్రులు, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ స్థానాల నుంచి పోటీ చేస్తున్న వైఎస్సార్ సీపీ అభ్యర్థులను గెలిపించాలని ఎమ్మెల్యే కేపీ నాగార్జునరెడ్డి కోరారు. ఆదివారం రాత్రి తన క్యాంప్ కార్యాలయంలో పట్టణ కౌన్సిలర్లు, కో ఆప్షన్ సభ్యులు, వార్డు ఇన్‌చార్జిలు, సచివాలయ కన్వీనర్లు, వార్డు అధ్యక్షులు, ముఖ్య నాయకులతో ఎమ్మెల్సీ ఎన్నికలపై ఆయన సమీక్షించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కేపీ మాట్లాడుతూ ఎమ్మెల్సీ అభ్యర్థులను గెలిపించేందుకు ప్రతి ఒక్కరూ బాధ్యత తీసుకోవాలన్నారు. సుమారు 6 వేల ఓట్లు ఉన్నాయని, ఆరు పోలింగ్ బూత్‌లు ఏర్పాటు కానున్నాయని, అందరూ ఇన్‌చార్జిలు ప్రచార బాధ్యతలు తీసుకోవాలన్నారు. మొదటి ప్రాధాన్యం ఓటును వైఎస్సార్ సీపీ అభ్యర్థులకు వేయించాలన్నారు. ఎన్నికల రోజు ఓటింగ్‌పై కూడా ఇన్‌చార్జిలు దృష్టి పెట్టాలన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అన్ని సంక్షేమ పథకాలను పార్టీలు, కుల, మత, వర్గాలతో సంబంధం లేకుండా అర్హులైన ప్రతి ఒక్కరికీ ఇచ్చారన్నారు. పేద, మధ్య తరగతి ప్రజల ఆర్థిక, సామాజిక అభివృద్ధి కోసం నిరంతరం కృషి చేస్తున్నట్లు చెప్పారు. గృహ సారథులు, సచివాలయ కన్వీనర్లు ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం ద్వారా ఎంత లబ్ధి పొందింది వివరించాలన్నారు. సచివాలయ వ్యవస్థ ద్వారా రాష్ట్రంలో లక్షలాది మంది నిరుద్యోగులకు ఉద్యోగాలు కల్పించిన ఘనత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతోందన్నారు. మున్సిపల్ చైర్మన్ చిర్లంచర్ల బాలమురళీకృష్ణ, వైఎస్సార్ సీపీ పట్టణ అధ్యక్షుడు, వైస్ చైర్మన్ షేక్ ఇస్మాయిల్, వైస్ చైర్మన్-2 అంజమ్మ శ్రీనివాసులు, కౌన్సిలర్లు చాటకొండ చంద్ర, సిరాజ్, కొత్త కృష్ణ, హర్షిత, షేక్షావలి, మహ్మద్, అమీరుల్లాఖాన్, నగేష్, రామడుగు రమేష్, బాలసుబ్బారావు, మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ షేక్షావలి, కరీంబాషా పాల్గొన్నారు.

మానవత్వాన్ని చాటుకుందాం..



మాట్లాడుతున్న అష్రఫ్ అలీ

మార్కాపురం: సమాజంలో అంతరించిపోతున్న మానవత్వాన్ని చాటుకునేందుకు తోటివారికి సాయం చేద్దామని జమాతే ఇస్లామి హింద్ రాష్ట్ర సలహా మండలి సభ్యుడు అష్రఫ్ అలీ అన్నారు. ఆదివారం సాయంత్రం ప్రెస్ క్లబ్‌లో జమాతే ఇస్లామి హింద్ ఆధ్వర్యంలో మానవత-నైతికతపై రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కుల, మతాలకు అతీతంగా మానవత్వాన్ని నైతికతను బతికించేందుకు జమాతే ఇస్లామి హింద్ చేస్తున్న కృషిని అభినందించారు. సమాజంలో నేరాలు, మారణహోమాలతో మానవత్వం నశిస్తోందని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రతి ఒక్కరూ నైతిక విలువలు పాటించాలని, మానవత్వం సత్యం ద్వారా ఇది సాధ్యమన్నారు. సమావేశంలో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చింతగుంట్ల బాబు, ఎంపీజే రాష్ట్ర కార్యదర్శి అబ్దుల్ రజాక్, రోజ్ మీడియా, నూతలపాటి రాజు, లూకయ్య, పల్నాటి రెహమాన్, అయూబ్ ఖాన్, మాలిక్ బాషా, సికిందర్, అజీజ్ అహ్మద్ పాల్గొన్నారు.

వైభవంగా రథోత్సవం



అశేష జనవాహిని మధ్య రథం



శంఖం పూరిస్తున్న నిర్వాహకుడు



అన్నదానం చేస్తున్న ఎమ్మెల్యే కేపీ



కోలాటం ప్రదర్శిస్తున్న చిన్నారులు

పొదిలి రూరల్: పొదిలిలో మహా శివరాత్రి పర్వదినం సందర్భంగా పార్వతీదేవి సమేత నిర్మమహేశ్వర స్వామి రథోత్సవం ఆదివారం కన్నుల పండువగా నిర్వహించారు. పొదిలి పరిసర ప్రాంతాల నుంచి రథోత్సవం తిలకించేందుకు వచ్చే భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా పట్టణ వాసులు ఎవరికివారే స్వచ్ఛందంగా భారీ ఎత్తున అన్నదాన కార్యక్రమాలు ఏర్పాటు చేశారు. మార్కాపురం అడ్డ రోడ్డు, పొదిలి విశ్వనాథపురంలో ఆంజనేయస్వామిగుడి సెంటర్, కాలేజీ రోడ్డు, వైఎస్సార్ బొమ్మ సెంటర్, ఆర్టీసీ డిపో దగ్గర, పెదబస్టాండ్, చిన్న బస్టాండ్, అమ్మవారిశాల, పంచాయతీ ఆఫీసు, శివాలయం, అయ్యప్ప స్వామి గుడి, డాల్‌మిల్లులో అన్నదాన కార్యక్రమాలు నిర్వహించి దాతలు తమ దాతృత్వాన్ని చాటుకున్నారు. రథోత్సవం మిట్ట మధ్యాహ్నం సమయం కావడంతో ఎండ ఎక్కువగా ఉండటంతో చుట్టుపక్కల నుంచి వచ్చే వారికి మంచినీరు, మజ్జిగ, చల్లని పానీయాలు పంపిణీ చేశారు. పులిహోర, పొంగళి, పెరుగన్నం వంటి అల్పాహారంతో పాటు అన్నదానం ఎవరకు తోచిన విధంగా వారు ఎక్కడికక్కడ ఏర్పాటు చేసి భక్తుల ఆకలి తీర్చారు. ఎమ్మెల్యే కేపీ నాగార్జునరెడ్డి వైఎస్సార్ విగ్రహం వద్ద అన్నదానం చేశారు.

ఆకట్టుకున్న సాంస్కృతిక కార్యక్రమాలు

రథోత్సవం సందర్భంగా పలు రకాల సాంస్కృతిక కార్యక్రమాలు భక్తులను ఆనందపరిచాయి. ముఖ్యంగా బాలికలు వేసిన కోలాటం చూపరులను ఎంతగానో ఆకట్టుకుంది. కొంతమంది కళాకారులు చేసిన విచిత్ర విన్యాసాలు చిన్నారులను కనువిందు చేశాయి. డప్పులు కొడుతూ..బాణసంచులు కాల్చుతూ యువకులు చిందులు వేసుకుంటూ తిరునాళ్లకు వచ్చిన వారిని ఉత్సహపరిచారు.

70 మంది పోలీసులతో భారీ బందోబస్తు

రథోత్సవం సందర్భంగా ఎక్కడా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. దర్శి డీఎస్పీ నారాయణ స్వామిరెడ్డి పర్యవేక్షణలో, పొదిలి సీఐ సుధాకర్‌రావు ఆధ్వర్యంలో దర్శి, కొండపి సీఐలు రామకోటయ్య, శ్రీనివాసరావు, పొదిలి, కొనకనమిట్ల, తాడివారిపల్లి, ముండ్లమూరు, తాళ్లూరు, మర్రిపూడి ఎస్ఐలతో పాటు ఆయా పోలీసుస్టేషన్‌ల పరిధిలో ఉన్న 50 మంది పోలీసులతో పాటు 20 మంది స్పెషల్ పార్టీ పోలీసులు, మహిళా పోలీసులతో భద్రత ఏర్పాటు చేశారు. పట్టణంలో తిరునాళ్ల సందర్భంగా ట్రాఫిక్ సమస్యతో భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకున్నారు. వాహనాల రాకపోకలకు ఎలాంటి ఇబ్బంది లేకుండా ఎప్పటికప్పుడు రథం తిరిగే ప్రాంతం కాకుండా వేరే మార్గంలో వాహనాలు మళ్లించి ట్రాఫిక్ అంతరాయం లేకుండా చేశారు.

వైద్య శిబిరం ఏర్పాటు

రథోత్సవం సందర్భంగా అపశృతి చోటు చేసుకున్నా, ఏదైనా ప్రమాదం సంభవించినా వెంటనే చికిత్స చేసేందుకు వైద్య ఆరోగ్య శాఖ అధ్వర్యంలో శివాలయంలో వైద్యశిబిరం ఏర్పాటు చేశారు. ముఖ్యంగా షుగర్, బీపీ పరీక్షలు, జ్వరం, తలనొప్పి, జలుబు, షుగరు, బీపీ ముదలైన జబ్బులకు సంబధించిన మాత్రలు, సెలైన్‌లు అందుబాటులో ఉంచారు.

విద్యుత్ సమస్య తలెత్తకుండా జాగ్రత్తలు

రథోత్సవం సందర్భంగా ఎటువంటి ఆటంకం కలగకుండా విద్యుత్ అధికారులు ముందు జాగ్రత్తలు తీసుకున్నారు. రథం తిరిగే ప్రాంతాల్లో ఉదయం విద్యుత్ సరఫరా నిలిపి వేసి సర్వీస్ వైర్లను తప్పించారు. మధ్యాహ్నం రథోత్సవం ప్రారంభమైన వెంటనే వెనుక నుంచి సర్వీస్ వైర్లను పునరుద్ధరించి ప్రజలకు విద్యుత్ సరఫరా సమస్య లేకుండా చేశారు. ఎవరి విధులు వారు సక్రమంగా సకాలంలో నిర్వర్తించడంతో ఎక్కడా ఎలాంటి అవరోధాలు, ఆటంకాలు లేకుండా మొత్తం మీద రథోత్సవం ప్రశాంతంగా ముగియడంతో అదికారులు, భక్తులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

గుండ్లబ్రహ్మేశ్వర ఆలయంలో ఎమ్మెల్యే అన్నా పూజలు

గిద్దలూరు రూరల్: నల్లమల అభయారణ్యంలో కొలువుదీరిన గుండ్లబ్రహ్మేశ్వర స్వామి ఆలయంలో స్థానిక ఎమ్మెల్యే అన్నా రాంబాబు ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. మహాశివరాత్రి మరుసటి రోజు సందర్భంగా స్వామివారి కల్యాణ మహోత్సవం ముగింపు కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఎమ్మెల్యేతో పాటు అధిక సంఖ్యలో భక్తులు స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. గిద్దలూరు అటవీశాఖ డిప్యూటీ డైరెక్టర్ వై.నరసింహారావు పర్యవేక్షణలో కట్టుదిట్టమైన ఏర్పాట్ల మధ్య అటవీ ప్రాంతంలోని స్వామివారిని ఎమ్మెల్యే అన్నా రాంబాబు దర్శించుకున్నారు. ఆయన వెంట వైఎస్సార్ సీపీ నాయకులు పాల్గొన్నారు.

22న మండల సమావేశం

కొనకనమిట్ల: మండల పరిషత్ సర్వసభ్య సమావేశం ఎంపీపీ మోరబోయిన మురళీకృష్ణ యాదవ్ అధ్యక్షతన ఈ నెల 22 బుధవారం ఉదయం 10 గంటలకు నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ రావూరి జనార్దన్ ఒక ప్రకటనలో తెలిపారు. సమావేశంలో గ్రామాల అభివృద్ధిలో తీసుకోవాల్సిన అంశాలపై చర్చించనున్నట్లు పేర్కొన్నారు. మండలంలోని అన్నీ ప్రభుత్వ శాఖల అధికారులు తమ నివేదికలతో సమావేశానికి హాజరు కావాలన్నారు. సమావేశానికి నియోజకవర్గ ఎమ్మెల్యే కేపీ నాగార్జునరెడ్డి ముఖ్య అతిథిగా హాజరవుతారని పేర్కొన్నారు.

వైభవంగా లక్ష తులసీ దళార్చన

- హాజరైన కరణం వెంకటేష్



ప్రత్యేక అలంకరణలో చెన్నకేశవ స్వామి



స్వామివారికి పూజలు చేస్తున్న కరణం వెంకటేష్

వేటపాలెం: స్థానిక చెన్నకేశవ స్వామి దేవస్థానంలో స్వామి వారికి లక్ష తులసి దళార్చన మహోత్సవాన్ని పండితులు ఆదివారం వైభవంగా నిర్వహించారు. ముందుగా ఆలయంలో స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయ ప్రాంగణలో స్వామివారి మహా శాంతి హోమం చేశారు. అనంతరం పూర్ణాహుతి కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమానికి చీరాల నియోజకవర్గ వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జి కరణం వెంకటేష్ ముఖ్య అతిథిగా పాల్గొని స్వామి వారిని దర్శించుకొని పూజలు చేశారు. పండితులు వెంకటేష్‌ని ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఆలయ ప్రధాన అర్చకులు నారాయణం అనంత పద్మానాభాచార్యులు, శ్రీనివాసుల హనుమాచార్యులు తదితరులు పాల్గొన్నారు.

శింగరకొండ దర్శిని

అద్దంకి: శుభకృత్ నామ సంవత్సరం. ఉత్తరాయణం మాఘ మాసం ధనిష్ట నక్షత్రం పౌర్ణమి సందర్భంగా సోమవారం ప్రత్యేక పూజలు చేస్తారని శింగరకొండ దేవస్థాన ఏసీ సుభద్ర ఆదివారం తెలిపారు. ఉదయం 5 గంటలకు సుప్రభాత సేవ, 5.30 గంటలకు బిందె తీర్థం. మధ్యాహ్నం 1.00 గంట నుంచి 1.30 గంట వరకు పంచ హారతుల పూజ నిర్వహిస్తారు. సాయంత్రం 5.30 గంటలకు సువర్చలా సహిత దక్షిణాభిముఖ ప్రసన్నాంజనేయ స్వామి ఉత్సవ మూర్తులకు పల్లకీ సేవ నిర్వహిస్తారు. రాత్రి 7 గంటల నుంచి 7.45 గంటల వరకు జరిగే ప్రదోషకాలార్చన అనంతరం ఆలయం మూసివేస్తారు.

విహార యాత్రలు విజ్ఞానాన్ని పెంచుతాయి

యర్రగొండపాలెం: విహార యాత్రలు విద్యార్థుల్లో విజ్ఞానాన్ని పెంచుతాయని ఎంఈఓ పి.ఆంజనేయులు పేర్కొన్నారు. ఆదివారం ఆమనిగుడిపాడు ఎంపీపీఎస్ పాఠశాలకు చెందిన 60 మంది విద్యార్థులతో నాగార్జునసాగర్‌కు వెళ్తున్న బస్సును ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంఈఓ మాట్లాడుతూ.. విహార యాత్రలు విద్యార్థుల్లో విజ్ఞానంతోపాటు వినోదం, మానసిక ఉల్లాసాన్ని పెంపొందించి చదువుల్లో చురుకుగా ఉండేందుకు దోహదపడతాయన్నారు.కార్యక్రమంలో హెచ్ఎం విజయ, ఉపాధ్యాయులు సుబ్బారావు, నాగలక్ష్మి, రంగారావు పాల్గొన్నారు.